
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



'బాల్క సుమన్‌పై చర్యలు తీసుకోవాలి'

తలకొండపల్లి, ఫిబ్రవరి 7: సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌పై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు బుధవారం తలకొండపల్లి ఏఎస్ఐ సీతారామ్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో పీసీసీ కిసాన్ సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ లక్ష్మీదేవి రఘురాములు, ఎంపీటీసీ రమేశ్, ఉన్నారు. అలాగే రాంపూర్‌లో సుమన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. చిన్న హరి మోహన్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

పెళ్లి సందడి

3 నెలలు.. 30 రోజులు మంచి ఘడియలు



ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో వివాహాల కోలాహలం ప్రారంభంకానుంది. ఈ నెల 11వ తేదీన మాఘమాసం ప్రారంభమవుతుండటంతో మంచి ముహూర్తాల్లో పెళ్లిళ్లు జరిపించడానికి తల్లిదండ్రులు సిద్ధమవుతున్నారు. సుమారు రెండు నెలల విరామం తర్వాత శుభఘడియలు ఉండడంతో కల్యాణ మండపాల వద్ద పెళ్లి బృందాల సందడి మొదలుకానుంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వేల సంఖ్యలో నూతన జంటలు ఒక్కటి కానున్నారు. ఇందుకు అనుగుణంగా వధూవరులు, తల్లిదండ్రులు ముందస్తు పెళ్లి పనుల్లో బిజీబిజీగా ఉన్నారు.

శుభ ఘడియలు ఇవే...

మాఘం : ఫిబ్రవరి 13, 14, 17, 18, 24, 27, 28, 29, మార్చి 2, 3 తేదీలు

ఫాల్గుణం : మార్చి 15, 17, 20, 22, 24, 25, 27, 28, 30, ఏప్రిల్ 3, 4 తేదీలు

చైత్రం : ఏప్రిల్ 9, 18, 19, 20, 21, 22, 24, 26 తేదీలు

ఏప్రిల్ 28 నుంచి మూఢం ప్రారంభం, అక్టోబరు వరకు ముహూర్తాలు లేవు

ఈ నెల 11నుంచి మాఘమాసం ప్రారంభం
ఏప్రిల్ 26 వరకు వివాహాల కోలాహలం
ఆ తర్వాత మూఢం, శూన్యమాసం
తిరిగి ఆశ్వయుజ మాసంలో ముహూర్తాలు
ఉమ్మడి జిల్లాలో వేలల్లో జరగనున్న పెళ్లిళ్లు..
ఒక్కటి కానున్న కొత్త జంటలు

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 7): మాఘమాసం ఎప్పుడు వస్తుందా.. మంచి ముహూర్తం ఎప్పుడు కుదురుతుందా.. అని నవ వధూవరులు ప్రతీ ఏటా ఎదురు చూస్తుంటారు. ఇక ఆ టైం.. రానే వచ్చేసింది. పెళ్లి బాజా మోగే సమయం ఆసన్నమైంది. ఈనెల 11వ తేదీన మాఘమాసం ప్రారంభమవుతుండటంతో పెళ్లి సందడి మొదలైంది. ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ 26 వరకు మూడు నెలల్లో మంచి ముహూర్తాలున్నాయి. తర్వాత ఏప్రిల్ 28 నుంచి మూఢం ప్రారంభమవుతుంది. దీంతో వైశాఖం, జ్యేష్ఠ మాసాల్లో వివాహ ముహూర్తాలు లేవని పురోహితులు చెబుతున్నారు. తర్వాత ఆశాఢం శూన్య మాసం కావడంతో శుభ కార్యాలకు పనికిరాదు. మళ్లీ ఆశ్వీజం దసరా తర్వాత తిరిగి వివాహాలు జరగనున్నాయి.

ఏప్రిల్ 26 వరకే ముహూర్తాలు

మాఘం, ఫాల్గుణం, చైత్రం ఈ మూడు మాసాలు (ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ నెలల్లో) దాదాపు 30వరకు ముహూర్తాలు ఉన్నాయని పంచాంగకర్తలు చెబుతున్నారు. ఫిబ్రవరి 11న తొలి ముహూర్తం మొదలుకుని ఏప్రిల్ 26వ తేదీ వరకు మంచి ఘడియలున్నాయని ప్రకటించారు.

ఆరు నెలల వరకు ఆగాల్సిందే...

సాధారణంగా మే నెలలో కూడా పెళ్లి ముహూర్తాలు బాగా ఉంటాయి. అయితే ఈ ఏడాది ఏప్రిల్ 26వ తేదీతోనే పెళ్లి ఘడియలు అయిపోతున్నాయి. తర్వాత మూఢం వస్తుంది. దసరా తర్వాత (ఆశ్వయుజం) అక్టోబరు 12 తర్వాత ముహూర్తాలున్నాయి. ఆరు నెలల వరకు పెళ్లి ముహూర్తాలు లేవని పండితులు పేర్కొంటున్నారు.

ఫిబ్రవరి 18వ తేదీ ఆదివారం నవమి, రోహిని నక్షత్రం ఉండటంతో ఆరోజు దివ్యమైన ముహూర్తం ఉంది. ఆరోజు వేల జంటలు ఒక్కటి కానున్నాయి. ఫిబ్రవరి 14వ తేదీన వసంత పంచమి, రేవతి



నక్షత్రం ఉంది. మార్చి ఒకటో తేదీ శుక్రవారం శష్టి, స్వాతి నక్షత్రం లో, 3వ తేది ఆదివారం అనురాధ నక్షత్రం, 7వ తేది

దివ్యమైన ముహూర్తాలు

గురువారం ఉత్తరాషాఢ నక్షత్రంలో దివ్యమైన ముహూర్తాలు ఉండడంతో పెళ్లిళ్లు అధికంగా జరగనున్నాయి. అలాగే మార్చి 13వ తేదీ ఆశ్వినీ నక్షత్రం, 22వతేదీ శుక్రవారం మగనక్షత్రం, 24 ఆదివారం ఉత్తర నక్షత్రం, 27వ తేదీ బుధవారం చిత్తానక్షత్రం, 28వ తేదీ గురువారం స్వాతి నక్షత్రంలో మంచి ముహూర్తాలున్నాయి.. ఏప్రిల్ 3వ తేదీన ఉత్తరాషాఢ నక్షత్రం, అదే నెలలో చివరి దివ్యమైన ముహూర్తం 4వ తేదీ శ్రవణా నక్షత్రం కావడంతో పెళ్లిళ్లు జరగనున్నాయి.

లీపు సంవత్సరంలో..

లీపు సంవత్సరం నాలుగు సంవత్సరాలకు ఒకసారి అరుదుగా వస్తుంది. ఈ రోజు ఎంతో మందికి ప్రత్యేకం కూడా, సాధారణంగా ప్రతిఏటా క్యాలెండర్‌లో 365 రోజులు ఉంటే.. ఈ ఏడాది మాత్రం 366 రోజులు ఉంటాయి. అందుకే దీనిని లీపు సంవత్సరం అంటున్నాం. ఈరోజు పుట్టిన వారికి నాలుగేళ్లకోసారి బర్త్‌డే సెలబ్రేషన్స్ జరుపుకుంటారు. ఇక ఈ రోజు పెళ్లి చేసుకున్న వారు కూడా అంతే. వారి మ్యారేజ్ యానివర్సరీ నాలుగేళ్లకు వస్తుందన్న మాట. కొంత మంది వధూవరులు లీపు సంవత్సరాన్ని ఎంచుకున్నారు. లీపు సంవత్సరం ఫిబ్రవరి 29న పెళ్లి ముహూర్తం పెట్టుకున్నారు.



చేతినిండా పని

వివాహాల శుభఘడియల నేపథ్యంలో అన్ని వర్గాలకు ఉపాధి లభించనుంది. పెళ్లిళ్లు జరిగితే వేలాది మందికి ఉపాధి లభిస్తుంది. ఫ్లవర్ డెకరేషన్, భజంత్రీలు, వంటమాస్టర్స్ ఫోటో, వీడియోగ్రాఫర్స్, పురోహితులకు మంచి డిమాండ్ ఏర్పడనుంది. వివాహాలు జరుపుకునేందుకు కల్యాణమండపాలు, కన్వెన్షన్ హాల్స్, సత్రాలు, గదులు, క్యాటరింగ్ వంటివి ముందుగానే రిజర్వ్ చేసుకుంటున్నారు. మార్కెట్‌లో ఇప్పటికే వస్త్రాలు, బంగారం, సరుకులు కొనుగోళ్ల సందడి నెలకొంది. పట్టణాల్లో బంగారం షాపులు, వస్త్ర దుకాణాలు రద్దీగా మారాయి.

మూడు నెలల్లో జోరుగా వివాహాలు



ఈ ఏడాది వివిధ కారణాల వల్ల వివాహ ముహూర్తాలు తక్కువగా ఉన్నాయి. ఫిబ్రవరి 11 నుంచి ఏప్రిల్ 26వ తేదీ వరకూ ముహూర్తాలు ఉన్నందున వివాహాలు ఎక్కువగానే జరిగే అవకాశం ఉంది. ఫిబ్రవరి 18న దివ్యమైన ముహూర్తం ఉండటంతో ఆ రోజు నాకు మూడు వివాహాలు బుక్ అయ్యాయి. చేగిరెడ్డి ఘనాపూర్‌లో ఫిబ్రవరి 16, 17, 18 రామాలయం, శివాలయం, ఆంజనేయ స్వామి, ధ్వజ స్తంభం, నవగ్రహాల ప్రతిష్ఠపనతో పాటు వివాహాలు ఉన్నాయి.

- జోషి రాఘవేందర్‌రావు, పురోహితులు, చేగిరెడ్డి ఘనాపూర్, చౌదరిగూడ

ఆరు పెళ్లిళ్లు బుక్ అయ్యాయి



నాకు డెకరేషనే జీవనాధారం, వివాహాది శుభకార్యాలయాలకు వివిధ డిజైన్‌లో డెకరేషన్ చేస్తారు. ఎక్కువగా మార్చిలో డెకరేషన్ కోసం బుక్ చేసుకున్నారు. షాద్‌నగర్‌లోని ఎస్ఆర్ ఫంక్షన్‌హాల్లో ఎవరు పెళ్లి చేసినా డెకరేషన్ నేనే చేస్తాను. మార్చిలో 27, 28, 14, 22, 29, 17, తేదీల్లో డెకరేషన్ కోసం బుక్ చేసుకున్నారు.

- శేఖర్, డెకరేషనిస్టు, కొందుర్గు గ్రామం

గిరాకీ బాగానే ఉంది



ఈసారి పెళ్లిళ్ల గిరాకీ బాగానే ఉంది. ఈ నెల, వచ్చేనెల టెంట్ హౌస్ సామాన్లు బుక్ చేసుకున్నారు. టెంట్ వేసేందుకు కూలీలు దొరకడం లేదు. కూలీ రేట్లు పెంచేశారు. ఈ సారి మేము కూడ టెంట్ల ధరలు 10 శాతం పెంచుతున్నాం. పెళ్లిళ్ల సీజన్‌తో ఉపాధి లభిస్తుంది.

- యం. లక్ష్మయ్య, టెంట్‌హౌస్, మేడిపల్లి

14వ తేదీ ఎక్కువ ఆర్డర్స్ వచ్చాయి



ఈనెల 14వ తేదీ వసంత పంచమి ఉండటం.. ఆ రోజు దివ్యమైన ముహూర్తం ఉండటంతో పెళ్లిళ్లు ఎక్కువగా జరగనున్నాయి. దీంతో పెళ్లి పత్రికలకు ఆర్డర్స్ ఎక్కువ వచ్చాయి. వచ్చే నెలకు సంబంధించి కూడా ఆర్డర్స్ వస్తున్నాయి.

- సంతోష్‌కుమార్ గుప్తా, శ్రీ మణికంఠ ప్రింటర్స్, షాబాద్

ముందే బుక్ చేసుకుంటున్నాం



ఈ ఏడాది ఫిబ్రవరి 11 నుంచి వివాహాలు ఉండటంతో ముందే గార్డన్‌ను బుక్ చేసుకుంటున్నారు. ప్రస్తుతం మా గార్డెన్‌కు డిమాండ్ పెరిగింది. వధూవరూలకు తగ్గట్టుగా పంత్ర్యేకంగా ఏర్పాట్లు చేస్తున్నాము. వివిధ రకాల పూలతో డెకరేషన్, ఆలంకరణ అందుబాటులో ఉంచటం జరిగింది. వంట చేసే మాస్టర్ కూడ అందుబాటులో ఉన్నారు.

- దేవులపల్లి రాకేష్‌గౌడ్, రాజ్‌రాగూర్ గార్డెన్ మేనేజర్, హిమాయత్‌నగర్, మొయినాబాద్

ఫంక్షన్ హాళ్ల బుకింగ్ జోరు

వరుసగా పెళ్లి ముహూర్తాలు ఉండటంతో ఫంక్షన్‌హాల్స్ బుకింగ్ జోరుగా కొనసాగుతోంది. నగర శివారులో రికార్డు స్థాయిలో ఫంక్షన్ హాల్స్ ఉన్నాయి. సామాన్య మధ్యతరగతి వర్గాల ప్రజలు తమ ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా ఫంక్షన్ హాల్స్ బుక్ చేసుకుంటున్నారు. ఆర్థికంగా ఉన్న వాళ్లు మాత్రం అందుకనుగుణంగా పెళ్లిళ్లు చేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. పెద్ద పెద్ద కన్వెన్షన్లు బుక్ చేసుకుంటున్నారు. వీటి అద్దె లక్షల్లోనే ఉంటున్నా.. ఏమాత్రం వెనుకాడడం లేదు.



అక్షరాలు దిద్దిన చోటును..
అందంగా తీర్చిదిద్ది

- చదువుకున్న పాఠశాలపై తాజా మాజీ సర్పంచ్ మమకారం
- విద్యార్థులకు ఉపయోగపడేలా గోడలపై బొమ్మలు వేయించిన దాత

కేశంపేట, ఫిబ్రవరి 7: తాను చదువుకున్న పాఠశాలపై మమకారం పెంచుకున్న ఓ పూర్వవిద్యార్థి పాఠశాల తరగతి గదులను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దాలనుకున్నాడు. అనుకున్నదే తడవుగా తన ఆలోచనను ఆచరణలో పెట్టాడు. పాఠశాలలోని నాలుగు గదుల్లో విద్యార్థుల తరగతులను బట్టి పలు రకాల చిత్రాలు(పెయింటింగ్స్) వేయించాడు. వివరాల్లోకి వెళితే.. కేశంపేట మండల కేంద్రంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 1980 నుంచి 1985 వరకు కేశంపేటకు చెందిన తలసాని వెంకటరెడ్డి(తాజా మాజీ సర్పంచ్) 5వ తరగతి వరకు చదువుకున్నాడు. అయితే, తాను చదువుకున్న పాఠశాల భవనం ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుంది. ఆయన సర్పంచ్‌గా ఉన్న సమయంలో మన ఊరు-మన బడి, జాతీయ ఉపాధిహామీ పథకంలో భాగంగా పాఠశాలకు నూతన భవనం, కిచెన్‌షెడ్ నిర్మాణానికి గత ప్రభుత్వ హయాంలో రూ.77.92 లక్షలు మంజూరు చేయించారు. కాంట్రాక్టర్‌తో మాట్లాడి శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనాన్ని కూలగొట్టించి, ఇటీవల నూతన భవనం నిర్మించారు. కిచెన్ పనులు కూడా త్వరలో చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నారు. కాగా, రూ.50వేల సొంతంగా వెచ్చించి పాఠశాల గదుల గోడలపై రంగురంగుల బొమ్మలు వేయించారు. తరగతి గదుల్లో మానవ శరీర అవయవాలు, కూరగాయలు, పువ్వులు, రవాణా వ్యవస్థ, గణితం, తెలుగు నెలలు, తెలుగు వర్ణమాల, జంతువులు, దిక్కులు, సౌరవ్యవస్థకు సంబంధించిన చిత్రాలు గోడలపై వేయించారు. చూడటానికి బొమ్మలు ఎంతో ఆకర్షణీయంగా ఉన్నాయి. విద్యార్థులు వాటిని చూస్తూ ఉల్లాసంగా చదువుకుంటున్నారు.

పాఠశాలపై మమకారంతోనే..



తాను చదువుకున్న పాఠశాలపై మమకారంతోనే గదుల్లో వివిధ రకాల బొమ్మలు వేయించాను. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాల కూడా రంగురంగుల బొమ్మలతో ఉండాలన్న ఉద్దేశ్యంతో రూ. 50వేలు ఖర్చుచేసి బొమ్మలు వేయించాను. పిల్లలు బొమ్మలు చూస్తూ చదువుకోవడం ఆనందం కలిగిస్తుంది.

- తలసాని వెంకట్‌రెడ్డి, తాజా మాజీ సర్పంచ్, కేశంపేట

పాఠశాల అభివృద్ధికి వెంకట్‌రెడ్డి కృషి



వెంకట్‌రెడ్డి సర్పంచ్‌గా పదవి చేపట్టినప్పటి నుంచి పాఠశాల అభివృద్ధిపై చర్చించేవారు. మన ఊరు-మనబడి పథకం కింద పాఠశాలకు అప్పటి ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ సహకారంతో దాదాపు రూ.78లక్షలు మంజూరు చేయించారు. తరగతి గదులు పూర్తి కాగానే విద్యార్థులకు ఉపయోగపడే ఎన్నో చిత్రాలు వేయించారు.

- అప్పారావు, హెచ్ఎం, కేశంపేట ప్రాథమిక పాఠశాల

బొమ్మలు చాలా ఉపయోగపడుతున్నాయి



తరగతి గదులలో పాఠ్యాంశాలకు సంబంధించిన బొమ్మలు వేశారు. అవి మాకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. మానవ జీర్ణవ్యవస్థ, దిక్కులు, రవాణా మార్గాల బొమ్మలు చాలా బాగున్నాయి. రోజు చూస్తుండంతో మాకు గుర్తుంటున్నాయి.

- ఎస్.లక్ష్మి, 5వ తరగతి విద్యార్థిని



తరగతి గదుల్లో వేయించిన చిత్రాలు

'పది'లో వందశాతం
ఉత్తీర్ణత సాధించాలి

- వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి
- ప్రతీ విద్యార్థి ఉత్తీర్ణత సాధించేలా స్లిప్, మాక్ టెస్టులు నిర్వహించాలి
- జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్



మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

రంగారెడ్డి అర్బన్, జనవరి7 : జిల్లాలో పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ అన్నారు. జిల్లా కలెక్టరేట్‌లో బుధవారం 10వ తరగతి పరీక్షలపై ప్రధానోపాధ్యాయులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు గత సంవత్సరం కంటే అత్యుత్తమ ఫలితాలు సాధించాలనే లక్ష్యంతో ప్రధానోపాధ్యాయులు పని చేయాలన్నారు. విద్యార్థులు 10వ తరగతిలో పాసైతేనే జీవితంలో మెరుగైన స్థితిలో ముందుకు సాగుతారని తెలిపారు. గతంలో కంటే ప్రభుత్వ పాఠశాలల్లో వనరులు మెరుగు పడ్డాయని, విద్యార్థులు ఎంత వెనకబడి ఉన్నా మెరుగైన శిక్షణ ఇస్తే ఉత్తమ ఫలితాలు సాధించగలుగుతారన్నారు. వందశాతం ఉత్తీర్ణతకు కృషి చేయాలని, ప్రతీ విద్యార్థి పాస్ అయ్యేలా శిక్షణ ఇవ్వాలన్నారు. ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పించినా విద్యార్థులు ఫెయిలైతే అది మన బోధన లోపమేనని అదనపు కలెక్టర్ అన్నారు. గత ఫలితాలను దృష్టిలో పెట్టుకొని ఈ సంవత్సరం మెరుగైన ఫలితాలు సాధించడానికి ప్రయత్నించాలన్నారు. తన శిష్యుడు ఉన్నత స్థానానికి వెళితే గురువులు ఎంత గౌరవంగా భావిస్తారో, అదే ఫెయిలైతే అంతే అవమానంగా భావించాలన్నారు. 10వ తరగతిలో ఉత్తీర్ణత శాతం పెంచేందుకు ప్రత్యేక ప్రణాళిక అమలు చేయాలని సూచించారు. విద్యార్థులు అత్యధిక శాతం మ్యాథ్స్, సైన్స్ సబ్జెక్టుల్లోనే వెనుకబడి ఉన్నారని, ఆలాంటి వారిపై ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటే ఫలితం ఉంటుందని సూచించారు. ఉత్తమ ఫలితాల కోసం ఎక్కువగా స్లిప్ టెస్టులు, మాక్ టెస్టులు నిర్వహించి వాటిపై రివిజన్ చేస్తే విద్యార్థులకు ఫైనల్ పరీక్షల భయం పోతుందన్నారు. రివిజన్ చేస్తే విద్యార్థులు మరిచిపోరని తెలిపారు. ప్రాక్టీస్ ఎక్కువగా చేయించేలా ప్రోత్సహించాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాలు ఏర్పాటు చేసి పిల్లల వెనుకబాటుపై చర్చించి వారికి సూచనలు చేయాలన్నారు. విద్యాధికారి సుశీందర్‌రావు మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఇ గ్రేడ్ విద్యార్థులను గుర్తించి ఐదుగురి చొప్పున బృందాలు చేసి మెరుగైన సూచనలు చేసి, పరీక్షలకు ప్రిపేర్ చేయాలన్నారు. పరీక్షలు జరిగే వరకు పాఠశాలలో ఎలాంటి కల్చరల్ యాక్టివిటీస్ లాంటివి నిర్వహించకుండా విద్యార్థులచే ప్రతీ సబ్జెక్ట్‌ను ప్రాక్టీస్ చేయించి ఉత్తమ ఫలితాలు సాధించేలా చూడాలని తెలిపారు. ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు సమష్టిగా పని చేస్తే పదో తరగతిలో మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. ఈ సమావేశంలో ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

ఇది అనకొండ కాదు!

కేశంపేట, ఫిబ్రవరి 7: ఈ ఫొటోలో కనిపిస్తున్నది అనకొండ అనుకున్నారో పప్పులో కాలేసినట్లే.. ఇక్కడ సన్నని అనకొండ మాదిరిగా కనిపిస్తున్నది చెట్టు వేర్లు. కేశంపేట మటన్ మార్కెట్ ప్రాంతంలో కొందరి ఇళ్లలోకి మిషన్ భగీరథ నీరు రావడం లేదు. దాంతో బాధితులు గ్రామ పంచాయతీలో ఫిర్యాదు చేయగా అధికారులు నీరు ఎందుకు రావడం లేదని పరిశీలించారు. మిషన్ భగీరథ పైప్‌లైన్ తవ్వి చూడగా.. అందులో చెట్ల వేర్లు కనిపించాయి. అయితే, హరితహారం పథకంలో భాగంగా భగీరథ పైప్‌లైన్ పక్కనే మొక్కలు నాటడంతో అవి ఏపుగా పెరిగాయి. దాంతో వాటి వేర్లు మిషన్ భగీరథ పైప్‌లైన్‌లోకి చొచ్చుకు వెళ్లినట్లు జీపీ సిబ్బంది తెలిపారు. దాదాపు 40ఫీట్ల వరకు వేర్లు పైప్‌లైన్‌లోకి చొచ్చుకెళ్లినట్లు గుర్తించారు. అధికారులు బుధవారం వాటిని తొలగించారు.



40 ఫీట్ల మొక్కల వేర్లు



కేంద్రానికి అప్పగిస్తే
పోరాటమే
మాజీమంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

7

హాజీపల్లిని సందర్శించిన
వివిధ రాష్ట్రాల బృందం

షాద్‌నగర్‌రూరల్, ఫిబ్రవరి7: సంపూర్ణ పారిశుధ్యాన్ని సాధించి దేశ స్థాయిలో నిర్మల్ గ్రామ పురస్కారం అందుకున్న ఫరూఖ్‌నగర్ మండలం హాజీపల్లి గ్రామాన్ని బుధవారం రాజస్థాన్, ఆంధ్రప్రదేశ్ తదితర రాష్ట్రాల బృందం సభ్యులు బుధవారం సందర్శించారు. రాజేంద్రనగర్‌లోని ఎన్ఐఆర్‌డీలో శిక్షణ నిమిత్తం వచ్చిన బృందం సభ్యులు గ్రామాన్ని సందర్శించి అభివృద్ధి గురించి పంచాయతీ కార్యదర్శి నందినిని అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో పర్యటించి అభివృద్ధిని పరిశీలించారు. అనంతరం గ్రామ పంచాయతీలో సమావేశమై చర్చించారు.



గ్రామస్తులతో బృందం సభ్యులు

సేవాలాల్ ఉత్సవాలను జయప్రదం చేయాలి


మాట్లాడుతున్న రామునాయక్

బషీరాబాద్, ఫిబ్రవరి 7: సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతిని బంజార సంఘం నాయకులు జయప్రదం చేయాలని బంజార సంఘం, సేవాలాల్ మండల కమిటీ అధ్యక్షుడు రాము అన్నారు. బషీరాబాద్ రైతు వేదికలో సమావేశమయ్యారు. ఈ నెల 15న జయంతిన బషీరాబాద్‌లో ప్రతిష్ఠించే సేవాలాల్ విగ్రహావిష్కరణ కార్యక్రమంపై బంజారా నాయకులతో చర్చించారు. విగ్రహావిష్కరణకు తాండూరు ఎమ్మెల్యే బి.మనోహర్‌రెడ్డి, ముఖ్య నేతలు హాజరవుతారన్నారు. కార్యక్రమంలో కమిటీ వైస్‌ప్రెసిడెంట్ బస్సీలాల్, నరేష్‌చౌహాన్, శివనాయక్, సూర్యనాయక్, యువకులు పలువురు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవితను కలిసిన నాయకులు


కవితతో బషీరాబాద్ నాయకులు

బషీరాబాద్, ఫిబ్రవరి 7: మండల బీఆర్ఎస్ నాయకులు బుధవారం వికారాబాద్‌లో ఎమ్మెల్సీ కవితను కలిశారు. బీసీ రౌండ్ టేబుల్ సమావేశానికి హాజరైన ఆమెను జడల అనంతయ్య, మాధుసూదన్‌గౌడ్ తదితరులు కలిసి ముచ్చటించారు. బీసీ రిజర్వేషన్, చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్ కల్పించే విషయమై దృష్టి సారించాలని ఎమ్మెల్సీని కోరారు.

రైల్వే అండర్‌పాస్ పనులు పూర్తి చేయాలి


కిషన్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న విక్రమ్‌రెడ్డి

మేడ్చల్ టౌన్, ఫిబ్రవరి 7: మేడ్చల్, గుండ్ల పోచంపల్లి మున్సిపాలిటీల్లో అసంపూర్తిగా ఉన్న రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి పనులను త్వరగా పూర్తిచేయాలని కోరుతూ బుధవారం మేడ్చల్ రూరల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు పి.విక్రమ్‌రెడ్డి ఆధ్వర్యంలో కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో నాయకులు కేంద్ర మంత్రి, దక్షిణ మధ్య రైల్వే జీఎం ఆరుణ్‌కుమార్‌లను కలిసి వినతిపత్రం ఇచ్చారు. పనులు ప్రారంభించి నాలుగేళ్లవుతున్నా పనులు పూర్తికాక రెండు మున్సిపాలిటీల, 8 గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీజేపీ నాయకులు వారికి వివరించారు.

'మూసిన రైల్వే గేటును వెంటనే తెరవాలి'

మేడ్చల్ టౌన్, ఫిబ్రవరి 7: రైల్వే అండర్‌పాస్ నిర్మాణం కోసం గౌడవెల్లిలో మూసిన రైల్వే గేటును వెంటనే తెరవాలని గ్రామస్తులు తహసీల్దార్ శైలజను కోరారు. ప్రత్యేకాధికారిగా బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్ బుధవారం గ్రామాన్ని సందర్శించారు. రైల్వే గేట్‌ను మూయడంతో చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోందన్నారు. నిర్మాణ సమయంలో ప్రత్యామ్నాయ దారిని చూపేవరకు గేట్‌ను కొనసాగించాలన్నారు. ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోతానని తహసీల్దార్ తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా విధులు నిర్వహించాలని సిబ్బందికి ఆదేశించారు.

వాహనాలకు నెంబర్‌ప్లేట్ తప్పనిసరి



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై

షాద్‌నగర్‌రూరల్, ఫిబ్రవరి 7 : వాహనాలకు నెంబర్ ప్లేట్, రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా ఉండాలని ట్రాఫిక్ ఎస్సై రవీందర్‌నాయక్ అన్నారు. షాద్‌నగర్ శివారులోని పలు కూడళ్ల వద్ద బుధవారం వాహనాలను తనిఖీ చేసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెంబర్‌ప్లేట్, రిజిస్ట్రేషన్ లేని వాహనాలను సీజ్ చేయడంతో పాటు, కోర్టుకు పంపడం జరుగుతుందని చెప్పారు. తనిఖీ సందర్భంగా ఏడు వాహనాలు సీజ్ చేశామని తెలిపారు. వాహనం కొనుగోలు చేసిన నెల రోజుల్లో తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని తెలిపారు.

ఎల్డీఎమ్‌తో గొప్ప నాయకత్వ లక్షణాలు



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

మహేశ్వరం, ఫిబ్రవరి 7 : లీడర్‌షిప్ డెవల్‌ఎమెంట్ మిషన్ (ఎల్డీఎమ్) బలమైన నాయకత్వాన్ని తయారు చేస్తున్నదని, దీని వల్ల సమాజానికి ఎంతో మంది గొప్ప నాయకులను కాంగ్రెస్ పార్టీ అందిస్తున్నదని కాంగ్రెస్ పార్టీ ఓబీసీ డిపార్ట్‌మెంట్ జాతీయ కోఆర్డినేటర్ వెంకటేశ్వర్లు, డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం తుక్కుగూడలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఎల్‌డీఎమ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎల్డీఎమ్‌లో నేర్చుకున్న విషయాలను తప్పక ఆచరణలో పెట్టాలన్నారు. ఎల్‌డిఎమ్ మిషన్‌లో చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గాన్ని ఎంపిక చేసినందుకు పార్టీ అధిష్ఠానానికి ధన్యవాదాలు తెలిపారు. మహేశ్వరంలో కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేయాలని, పార్టీలో గ్రూపుతగాదాలకు స్వస్తి పలికి కలిసికట్టుగా ఉండాలని కార్యకర్తలు, నాయకులకు సూచించారు. నాయకులు పాల్గొన్నారు.

హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ సీఐల బదిలీ

యాచారం, ఫిబ్రవరి 7 : రాచకొండ పోలీస్ కమిషనర్ పరిధిలో 34 మంది సీఐలను బుధవారం సాయంత్రం బదిలీ చేస్తూ సీపీ ఉత్తర్వులు జారీ చేశారు. భువనగిరి సీసీఎస్‌లో పనిచేస్తున్న ఎన్.శంకర్‌కుమార్‌ను యాచారం ఇన్‌స్పెక్టర్‌గా నియమించారు. యాచారం సీఐగా పనిచేస్తున్న సైదయ్యను అబ్దుల్లాపూర్‌మెట్ స్టేషన్‌కు బదిలీ చేశారు. హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ సీఐగా పనిచేస్తున్న ఎల్.రామాంజనేయులును స్పెషల్ బ్రాంచ్‌కు బదిలీ చేశారు. స్పెషల్ బ్రాంచ్‌లో పనిచేస్తున్న జి.నాగరాజును హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ సీఐగా నియమించారు.

ఉపాధి పనులను పరిశీలించిన ఎంపీడీవో

యాచారం, ఫిబ్రవరి 7 : ప్రతి ఉపాధి కూలీకి చేతినిండా పని కల్పించి ఆదుకుంటామని ఎంపీడీవో విజయలక్ష్మి అన్నారు. బుధవారం యాచారం మండల కేంద్రంలో ఉపాధి పనులను పరిశీలించి కూలీల సమస్యలు తెలుసుకున్నారు. ప్రతి వారం వేతనాలు తమ ఖాతాలో జమచేసేలా చర్యలు తీసుకోవాలని కూలీలు ఎంపీడీవోను కోరారు. వర్షం నీరు భూగర్భంలోకి ఇంకున్నట్లు సరిహద్దు కందకాలు తవ్వాలన్నారు. కూలీలు పనులు చేస్తున్న చోట తాగు నీరు అందుబాటులో ఉండేట్లు చూడాలని ఉపాధిహామీ పథకం సిబ్బందిని ఆదేశించారు. వరద నీరు వృధాగా పోకుండ సరిహద్దు కందకాలు తవ్వాలని కూలీలకు చెప్పారు. ఎండలు ముదురుతుండడంతో టెంట్లు వేయించాలని ఫీల్డ్ అసిస్టెంట్ జంగయ్యకు సూచించారు.

కేంద్రానికి అప్పగిస్తే పోరాటమే

● మాజీమంత్రి, ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

కందుకూరు, ఫిబ్రవరి 7 : కృష్ణ ప్రాజెక్టులను కెఆర్ఎంబికి అప్పగిస్తే ప్రజలతో కలిసి పోరాటం చేయడానికి బీఆర్ఎస్ సిద్ధంగా ఉందని, కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితాఇంద్రారెడ్డి అన్నారు. బుధవారం మండల పరిషత్తు కార్యాలయంలో ఆపార్టీ నేతలతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల ఆకాంక్ష మేరకే మాజీ సీఎం కేసీఆర్ పది సంవత్సరాల పాటు పనిచేశారని, కృష్ణ బోర్డు నుంచి రాష్ట్రానికి రావాలసిన నీటి వాటా కోసం సుప్రీం కోర్టుకు వెల్లారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం కృష్ణ బోర్డు ట్రిబినల్ నిర్ణయాన్ని వినకుండానే కేఆర్ఎంబీకి ఇవ్వడానికి ప్రయత్నిస్తున్నదని విమర్శించారు. దీంతో రంగారెడ్డి, మహబూబ్‌నగర్, హైదరాబాద్, నల్గొండ, ఖమ్మం జిల్లాలు కృష్ణనీటిపై హక్కులు కోల్పోతాయని చెప్పారు. దీనికి నిరసగా ఈనెల 13న బీఆర్ఎస్ తలపెట్టిన బహిరంగ సభకు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. బీఆర్ఎస్ హయాంలో రంగారెడ్డి జిల్లా కందుకూరులో మంజూరు చేసిన మెడికల్ కళాశాలకు, ఆస్పత్రికి నిధులు కేటాయించామని, ఇక్కడ ఆస్పత్రి లేదని కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపివేసిందని ఆరోపించారు. ఇక్కడ మెడికల్ కాలేజీ, ఆస్పత్రిని నిర్మిస్తే, ఉమ్మడి రంగారెడ్డి, మహబూబ్‌నగర్, నల్గొండ జిల్లా వాసులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. అధికారంలోకి వచ్చాక సీఎం రేవంత్ రెడ్డి హామీలను విస్మరిస్తున్నారని ఆరోపించాంచారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు ప్రజలతో కలిసి ఉద్యమిస్తామని చెప్పారు. జడ్పీటీసీ జంగారెడ్డి, ప్యాక్స్ చైర్మన్ చంద్రశేఖర్, ఏఎంసీ చైర్మన్ సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలతో కలిసి పనిచేసిన వారు రానిస్తారు

పదవుల్లో ఉన్నప్పుడు ప్రజలతో కలిసి పనిచేసే వారు రాజకీయాల్లో రానిస్తారని, ఐదేళ్లుగా గ్రామాల అభివృద్ధికి పోటీ పడి పనిచేసిన ఘనత తాజా మాజీ సర్పంచ్‌లకే దక్కుతుందని జడ్పీచైర్ పర్సన్ తీగల అనీతారెడ్డి, మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితాఇంద్రారెడ్డి అన్నారు. బుధవారం ఎంపీపీ మంద జ్యోతి అధ్యక్షతన మండల పరిషత్తు కార్యాలయంలో తాజా మాజీ సర్పంచ్‌లక ఆత్మీయ వీడ్కోలు సమావేశంలో పాల్గొని వారు మాట్లాడారు. గ్రామాల అభివృద్ధి కోసం మాజీ సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన పల్లె ప్రగతిని విజయవంతం చేయడానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు బాగా పనిచేశారన్నారు. సర్పంచ్‌లు ఆత్మసైర్యంతో ప్రజల కోసం పనిచేసినట్లు చెప్పారు. రెండు సంవత్సరాలు కరోనా వల్ల భయాందోళనతో పనిచేసినప్పటికి, మిగతా మూడు సంవత్సరాలు ప్రజలకు అనేక సేవాకార్యక్రమాలు చేపట్టినందుకు వారిని అభినందించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్‌లు వారి అనుభవాలను పంచకున్నారు. అనంతరం వారిని ఘనంగా సన్మానించారు. జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, వైస్ ఎంపీపీ గంగుల శమంతప్రభాకర్‌రెడ్డి, మార్కెట్ కమిటి చైర్మన్ ఎస్ సురేందర్‌రెడ్డి, సహకార సంఘం చైర్మన్ డి.చంద్రశేఖర్, ఎంపీడీవో వెంకట్రాములు, మాజీ ఎంపీపీ జె.పెద్దరామయ్య, మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు ఎస్ రాజశేఖర్ రెడ్డి, నాయకులు మన్నె జయేందర్, కాకి ధశరథ, బి.వెంకటేష్, మేఘనాథ్‌రెడ్డి, కె.సధానంద్‌గౌడ్, పాండుగౌడ్,రాజు, ధామోదర్‌గౌడ్, ఎంపీటీసీలు కాకి రాములు, ఎల్మటి లక్ష్మి, టి.ఇందిరదేవేందర్, పాల్గొన్నారు.



తాజా మాజీ సర్పంచ్‌లను సన్మానిస్తున్న జడ్పీచైర్ పర్సన్ తీగల అనీతారెడ్డి ఎమ్మెల్యే పి సబితాఇంద్రారెడ్డి

డీన్ అవమానించాడని విద్యార్థి ఆత్మహత్యాయత్నం

● కళాశాల భవనంపై నుంచి దూకిన విద్యార్థి

● తీవ్ర గాయాలు.. నీలిమా ఆసుపత్రిలో చికిత్స



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జ్ఞానేశ్వర్

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 7 : చదువు రాదని.. డీన్ అవమానపరచడంతో మనస్తాపానికి గురైన ఓ ఇంజనీరింగ్ విద్యార్థి కళాశాల భవనంపై నుంచి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన పోచారం ఐటీసీ పోలీసుస్టేషన్ పరిధిలోని అనురాగ్ యూనివర్సిటీలో బుధవారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. మేడ్చల్ జిల్లా, ఘట్‌కేసర్ మండలం, వెంకటాపూర్‌లోని అనురాగ్ యూనివర్సిటీలో సిద్దిపేట జిల్లా, చిన్న కోడూర్ మండలం, చంద్లాపూర్ గ్రామానికి చెందిన నక్కిరెడ్డి తిరుపతిరెడ్డి చిన్న కుమారుడు జ్ఞానేశ్వర్‌రెడ్డి సీఎస్‌సీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. నాలుగురోజుల క్రితం సీఎస్‌సీ మొదటి సెమిస్టర్ ఫలితాలల్లో నాలుగు సబ్జెక్టుల్లో ఫెయిల్ అయ్యాడు. అప్పటి నుంచి డీన్ వీ.శ్రీనివాస్‌రావు(వీఎస్ రావు), పీటీలు కలిసి జ్ఞానేశ్వర్‌రెడ్డిని హేళన చేస్తూ ఇబ్బందులకు గురిచేశారని అతని కుటుంబీకులు ఆరోపించారు. విద్యార్థులందరి ముందు కొట్టడం, క్రమశిక్షణ లేకుండా హేయిర్‌కట్ చేసుకోకుండా కళాశాలకు ఎందుకువస్తున్నావని క్లాస్‌రూంలో నిలబెట్టి అవమానపరిచేవారని చెప్పారు. డీన్, పీటీలు చేస్తున్న అవమానం తట్టుకోలేక బుధవారం కళాశాలలోని సీ బ్లాక్ రెండో అంతస్తుపై నుంచి దూకి ఆత్మాహత్యాయత్నానికి పాల్పడ్డాడని తెలిపారు. సమాచారం బయటకు రాకుండా యూనివర్సిటీ యాజమాన్యానికి సంబంధించిన నీలిమా ఆసుపత్రిలోనే చికిత్స అందించారని ఆరోపించారు. డీన్, పీటీలపై విద్యార్థి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజువర్మ తెలిపారు.

ఎవరినీ అమమానపరచలేదు : వీ. శ్రీనివాస్‌రావు, డీన్ అనురాగ్ యూనివర్సిటీ

జ్ఞానేశ్వర్‌రెడ్డి కుటుంబసభ్యులు చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదని అనురాగ్ యూనివర్సిటీ డీన్ వీ శ్రీనివాస్‌రావు(వీఎస్ రావు) తెలిపారు. నాలుగు రోజులుగా అతను సమయానికి కళాశాలకు రావడం లేదని, ఎవరితో మాట్లాడకుండా మౌనంగా ఉంటున్న విషయాన్ని అతని తల్లిదండ్రులకు ఫోన్‌లో సమాచారం అందించాం. హేయిర్ కట్ చేసుకోమని చెప్పిన మాట వాస్తవం, దానికి అతను నేను దేవుడికి జుట్టు వదిలేశామని చెప్పడంతో అప్పటి నుంచి ఆ విషయం అడగలేదని వీఎస్ రావు అన్నారు. క్రమశిక్షణతో ఉండాలని, శ్రద్ధగా చదువుకోవాలని అందరు విద్యార్థులకు చెప్పినట్లుగానే అతనికి కూడా చెప్పామని, ఎవరిని అవమానపరచడం గాని హేళన చేయలేదని తెలిపారు.

నులి పురుగుల నివారణకు మాత్రలు

● జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ



మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్

వికారాబాద్, ఫిబ్రవరి 7 : నులి పురుగుల నివారణ కోసం విద్యార్థులందరికీ మాత్రలు అందించేందుకు సంబంధిత అధికారులు కృషి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ సూచించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లాస్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 12న జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని నిర్వహించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని చెప్పారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. జిల్లాలోని అన్ని పాఠశాలలు, వసతి గృహాలు, కస్తూరిబా గాంధీ విద్యాలయాలు, కళాశాలలలో చదువుతున్న విద్యార్థులకు మాత్రలు అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈనెల 19లోగా జిల్లాలోని విద్యార్థులందరికీ 100 శాతం నివారణ మాత్రలు అందించి లక్ష్యాన్ని పూర్తి చేసే విధంగా కృషి చేయాలని చెప్పారు. 1 నుంచి 19 సంవత్సరాల వయసు వారికి ప్రతి సంవత్సరం రెండుసార్లు మాత్రలు అందించడం జరుగుతోందని తెలిపారు. 2 సంవత్సరాల వయసు లోపు వారికి అరమాత్ర, 2నుంచి 19 సంవత్సరాల వయసు వారికి 1 మాత్ర అందిస్తారని తెలిపారు. మాత్ర వేసుకునే ముందు విద్యార్థులు భోజనం చేసే విధంగా ఉపాధ్యాయులు, అధికారులు పర్యవేక్షించాలని చెప్పారు. ఆశ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొని విజయవంతం చేయాలని సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి పాల్వన్ కుమార్, జిల్లా విద్యా శాఖ అధికారి రేణుకాదేవి , జిల్లా సంక్షేమ శాఖ అధికారి లలిత కుమారి, మెప్మా పీడీ రవికుమార్ , డీఐవో డాక్టర్ బుచ్చిబాబు, స్టాటిస్టికల్ ఆఫీసర్ చంద్రశేఖర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

తెలంగాణ ఆత్మగౌరవం కేంద్రానికి తాకట్టు

●మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

తాండూరు, ఫిబ్రవరి 7 : తెలంగాణ ప్రజల ఆత్మ గౌరవాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్రం వద్ద తాకట్టు పెట్టిందని మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం పట్టణంలోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలో కాంగ్రెస్ కలిసి పని చేస్తున్నాయని విమర్శించారు. కేంద్ర పరిధిలోకి ఇక్కడి ప్రాజెక్టులు వెళ్తే సాగునీరు దొరకడం కష్టమవుతుందన్నారు. సాగునీటి కోసం మాజీసీఎం కేసీఆర్ 10ఏళ్లపాటు తీవ్రంగా కష్టపడ్డారని, పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు పనులను 80శాతం పూర్తి చేశారని చెప్పారు. ఈ ప్రాజెక్టును కాంగ్రెస్ అడ్డుకునే ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు. దాన్ని కనుమరుగు చేసి నారాయణపేట్ - కోడంగల్ ఎత్తిపోతల ప్రాజెక్టును కాంగ్రెస్ తెరమీదికి తెచ్చిందన్నారు. కృష్ణ బోర్డు చేతుల్లోకి శ్రీశైలం ప్రాజెక్టు వెళితే పాలమూరుకు నష్టం జరుగుతుందని చెప్పారు.

ఎమ్మెల్యే చెంచాల మాటలు వినొద్దు

ఎమ్మెల్యే చెంచాల మాటలు నమ్మొద్దని రోహిత్‌రెడ్డి అన్నారు. అభివృద్ధి పనులకు తెచ్చిన ప్రొసిడింగ్ నకిలీవని ప్రచారం చేస్తున్నారని అవి నకిలీవని రుజువు చేస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటానని సవాళ విసిరారు. తమ కార్యకర్తలపై తప్పుడు కేసులు పెడుతున్నారని ఆరోపించారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ దీపానర్సింహులు, కౌన్సిలర్ శోభారాణి, శ్రీనివాస్‌చారి, పాల్గొన్నారు.

'ప్రజాపాలన' యాప్‌లో వివరాల సేకరణ

●క్షేత్ర స్థాయిలో పరిశీలన

●ఈ నెల 15 వరకు క్రాస్‌చెక్



యాప్‌లో వివరాలను పొందుపరుస్తున్న అధికారులు

తాండూరు, ఫిబ్రవరి 7: కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలలో మరో రెండు గ్యారంటీల అమలుకు ప్రభుత్వ ఆదేశాలతో అధికారులు కసరత్తును ప్రారంభించారు. గ్రామ, వార్డు స్థాయిలో అధికారులు పర్యటించి వివరాలను సేకరించాలని జిల్లా కలెక్టర్ మండల, మున్సిపాలిటీ స్థాయి అధికారులను ఆదేశించారు. బుధవారం నుంచి ఈ నెల 10 వరకు రూ. 500కు గ్యాస్ సిలిండర్, 15 వరకు 200 యూనిట్ల లబ్దిదారుల ఎంపికను పూర్తి చేయాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. ప్రజా పాలన మొబైల్ యాప్ ద్వారా ఈ వివరాలను సేకరించాలని సూచించారు. మహాలక్ష్మీ, గృహజ్యోతి పథకాలను ఈ నెలలో ప్రారంభించాలని రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిన విషయం విధితమే. రేషన్‌కార్డుల నంబర్‌లు సరిగా ఉన్నాయా, లేవా పరిశీలించడంతో పాటు, గ్యాస్ కనెక్షన్ వివరాలను సేకరించాలి. అధికారులు దరఖాస్తుదారుల నుంచి గ్యాస్ డెలివరీ రశీదు, పాస్ బుక్ పరిశీలించి యాప్‌లో ఎల్‌పిజి కంపెనీ పేరు, వినియోగదాడి నంబర్ నమోదు చేస్తున్నారు. రేషన్‌కార్డు నంబర్, గ్యాస్ కనెక్షన్ వివరాలలో తప్పులుంటే అప్‌లోడ్ చేసే సందర్భంలో ఫీల్డ్ వెరిఫికేషన్‌లో సరిదిద్దాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రతిరోజు పర్యవేక్షిస్తారు.

విద్యార్థినిపై పీఈటీ లైంగిక వేధింపులు

● పోలీసులకు బాలిక తండ్రి ఫిర్యాదు

● టీచర్‌పై ఆదిభట్ల పీఎస్‌లో కేసు నమోదు

ఆదిభట్ల, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : ఓ విద్యార్థినిపై పీఈటీ లైంగిక వేధింపులకు పాల్పడిన ఘటన రంగారెడ్డి జిల్లా ఆదిభట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ స్కూల్ క్యాంపస్‌లో జరిగింది. ఈమేరకు బుధవారం బాలిక తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాల్లోకి వెళితే.. ఆదిభట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ స్కూల్లో చదివే విద్యార్థినిపై పీఈటీ ప్రకాశ్ కొంత కాలంగా లైంగిక వేధింపులకు పాల్పడుతున్నాడు. విద్యార్థిని పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడంతో పాటు ఫోన్ చేసి మరీ వేధిస్తుండేవాడని బాలిక తండ్రి ఫిర్యాదులో పేర్కొన్నాడు. దాంతో విసిగిపోయిన అతడు బాలికపై లైంగిక, మానసిక వేధింపులకు పాల్పడినట్లు తెలిపాడు. పీఈటీపై కేసు నమోదు చేసినట్లు ఆదిభట్ల పోలీసులు తెలిపారు. కాగా, ఆ స్కూల్‌పై గతంలోనూ పలు ఆరోపణలు ఉన్నాయి. గతంలో 6వ తరగతి చదివే ఓ విద్యార్థి అనారోగ్యంతో కిందపడిపోతే సకాలంలో ఆస్పత్రికి చేర్చకపోవడంతో ఆ విద్యార్థి చనిపోయాడు.

దైవ చింతనతో ఆనందమయ జీవనం

ఆమనగల్లు, ఫిబ్రవరి 7 : దైవ చింతనతో ముందుకు సాగే వారు ఒత్తిళ్లను అధిగమించి ఆనందమ జీవితాన్ని పొందుతారని, సమాజ శాంతి కోసం ప్రతి ఒక్కరు ముందుకు సాగాలని ఐక్యత ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సుంకిరెడ్డి వరప్రసాద్‌రెడ్డి అన్నారు. ఊర్కొండ పేట అభయాంజనేయ స్వామి దేవాలయాన్ని బుధవారం వరప్రసాద్ రెడ్డి సందర్శించారు. ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలలో స్వామి వారికి పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయాల అభివృద్ధికి, భక్తుల సదుపాయాల కల్పనకు ఐక్యత ఫౌండేషన్ ద్వారా సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. దైవ కార్యక్రమాలలో ప్రతి ఒక్కరు పాలు పంచుకోవాలని ఆయన సూచించారు. దైవ, ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజ శాంతికి, వ్యక్తి సన్మార్గ పురోగమనానికి దోహద పడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు, నాయకులు అనిల్ గౌడ్, అభినవ్ రెడ్డి, కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, రచ్చ శ్రీరాములు, చంద్రశేఖర్, సుఖజీవన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తాతపై బెంగతో యువకుడి ఆత్మహత్య



ప్రభాకర్(ఫైల్)

బొంరాస్‌పేట, ఫిబ్రవరి 7: తన తాతపై బెంగతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన వికారాబాద్ జిల్లా, కొడంగల్ నియోజవర్గంలోని బొంరాస్‌పేట్ మండలంలో జరిగింది. మండల పరిధి నాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన చింతకింద ప్రభాకర్(22) తండ్రి ఐదేళ్ల క్రితం మృతి చెందాడు. దీంతో కుటుంబానికి పెద్దదిక్కుగా ఉన్న అతని తాత గత నెల 9న రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో మనస్తాపానికి గురైన ప్రభాకర్ బుధవారం మధ్యాహ్నం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తల్లి చింతకింద వెంకటమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అబ్దుల్‌రవూఫ్ తెలిపారు.

రేపు సామాజిక తనిఖీ బహిరంగ సభ



హుసేన్‌పూర్‌లో తనిఖీ చేస్తున్న అధికారులు

కొడంగల్, ఫిబ్రవరి 7 : ఉపాధిహామీ పథకంలో జరిగినపనులకు గ్రామాల్లో సామాజిక తనిఖీ పూర్తి కావడంతో ఈ నెల 9న కొడంగల్ ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో బహిరంగసభలో వివరాలను వెల్లడించనున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. కొడంగల్ మండలంలో ఏప్రిల్ 1, 2022 నుంచి మార్చి 31, 2023 వరకు జరిగిన పనులకు సంబంధించి .రూ.10,0385899 ఖర్చు చేశారు. ఈ పనులపై ఈ నెల 1 నుంచి గ్రామాల్లో సామాజిక తనిఖీలో భాగంగా గ్రామసభలు నిర్వహించారు. ఇప్పటి వరకు 12 విడతలుగా సామాజిక తనిఖీ జరగగా 13వ విడత సామాజిక తనిఖీకి అధికారులు సిద్ధమయ్యారు. మండలంలోని ఆలేడ్‌లో రూ.32,01,054, అంగడిరైచూర్‌లో రూ.69,25,114, అన్నారంలో రూ.31,19,074, అప్పాయిపల్లిలో రూ.44,16,045, భవనమ్మతండాలో రూ.18,72,681, బోయపల్లితండాలో రూ.21,39,346, చిన్ననందిగామలో రూ.41,95,586, చిట్లపల్లిలో రూ.55,43,178, హస్నాబాద్‌లో రూ.31,31,046, హుసేన్‌పూర్‌లో రూ.28,97,170, ఇందనూర్‌లో రూ.30,25,970, ఖాజఅహ్మద్‌పల్లిలో రూ.40,86,859, కస్తూర్‌పల్లిలో రూ.38,27,222, లక్ష్మీపల్లిలో రూ.54,61,390, నాగారంలో రూ.39,70,089, పలుగురాళ్లతండాలో రూ.29,06,909, పర్సాపూర్‌లో రూ.41,52,232 పెద్దనందిగామలో రూ.52,72,571, పోచమ్మతండాలో రూ.40,72,161, పాటిమీదిపల్లిలో రూ.29,70,234, ప్యాలమద్దిలో రూ.25,63,594, రావులపల్లిలో రూ.43,27,451, రుద్రారంలో రూ.48,61,469, సంగాయిపల్లిలో రూ.41,26,328, టేకుల్‌కోడ్‌లో రూ.42,40,191, ఉడిమేశ్వరంలో రూ.30,80,935 మొత్తం రూ.10,03,85,899కు సామాజిక తనిఖీ బహిరంగసభ నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.


సవాళ్లను ఎదుర్కొనే సత్తా ఉండాలి



నిక్‌ను సన్మానిస్తున్న గోపాల్ రెడ్డి

మేడ్చల్ టౌన్, ఫిబ్రవరి 7 : జీవితంలో పైకి రావాలంటే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొనే సత్తా ఉండాలని, ఎలాంటి విపత్కర పరిస్థితులనైనా ఎదుర్కునే విధంగా విద్యార్థులు తమకు తాముగా తీర్చిదిద్దుకోవాలన్నారు. ప్రముఖ మోటివేషన్ స్పీకర్ నిక్ ఉనిజిక్ అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ కండ్లకోయ పరిధిలోని సీఎంఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం విద్యార్థులకు మోటివేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిక్ మాట్లాడుతూ తన అంగ వైకల్యం గురించి విద్యార్థులకు వివరిస్తూ, తాను ఎదుర్కున్న ఇబ్బందులను సవాలుగా తీసుకుని ముందుకు సాగి తనకంటూ ఒక గుర్తింపు తీసుకొచ్చుకున్నాని తెలిపారు. కాళ్లు, చేతులు లేకపోయిన నేడు ప్రపంచంలోని వికలాంగుల్లో , విద్యార్థుల్లో , జీవితంతో నిరాషతో జీవిస్తున్న వారిలో ఉత్సాహాన్ని నింపే మోటివేటర్‌గా గుర్తింపు పొందానని చెప్పారు. నిరాశ పడకుండా విద్యార్థులు ముందుకు సాగిననాడే వారు అనుకున్న లక్ష్యాన్ని ఛేదించగలరన్నారు. సీఎంఆర్ ఇంజినీరింగ్ కళాశాల కార్యదర్శి గోపాల్‌రెడ్డి నిక్‌ను సన్మానించి జ్ఞాపికను అందజేశారు. కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి



బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

మహేశ్వరం, ఫిబ్రవరి 7 : ఎన్నికలముందు ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షుడు అలువాల రవికుమార్, స్టాఫ్ వర్కర్స్ ఫెడరేషన్ హైదరాబాదు రీజియన్ కార్యదర్శి ఎస్. కృష్ణ అన్నారు. ఆర్టీసీ అభివృద్ధి ప్రజల ప్రయోజనాలు, కార్మికుల సంక్షేమానికి సంబంధించిన రాష్ట్ర సదస్సు బుక్‌లెట్‌ను బుధవారం మహేశ్వరం ఆర్టీసీ డిపో ముందు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహాలక్ష్మి పథకం వల్ల ఆర్టీసీకి వస్తున్న ఆదాయలోటును ప్రభుత్వం చెల్లించాలన్నారు. మూడు నెలల డబ్బులను ముందుగానే ఆర్టీసీకి జమ చేయాలని కోరారు. ఆర్టీసీ విలీన ప్రక్రియను సత్వరమే పూర్తి చేయాలని, ఆర్‌పీఎస్ 2013 ఆరియర్స్ కోసం ఇచ్చిన బాండ్ డబ్బులను చెల్లించాలన్నారు. 173 నెలల డిఏ బకాయిలను చెల్లించాలన్నారు. కార్మికులు పాల్గొన్నారు.

ప్రతీ గడపకు కేంద్రప్రభుత్వ పథకాలు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కెఎస్ రత్నం

చేవెళ్ల, ఫిబ్రవరి 7: : కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కెఎస్ రత్నం అన్నారు. బుధవారం సాయంత్రం మండల పరిధిలోని మల్కాపూర్‌లో బీజేపీ నాయకులతో కలిసి గ్రామంలో ఇంటింటికి తిరిగి కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అన్ని వర్గాల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తుందన్నారు. దేశంలో బీజేపీ ప్రభుత్వం ఉంటేనే దేశం బాగుటుందని ప్రజలు భావిస్తున్నారని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రతి గడపకు తీసుకువెళ్లాలని చెప్పారు. భూత్ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసి వచ్చే ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి గెలుపుకు కృషి చేయాలని కోరారు. బీజేపీ మండల ఉపాధ్యక్షుడు కృష్ణగౌడ్, సీనియర్ నాయకులు ఆంజేయులు, దేవుని శర్వలింగం, హన్మంత్, శ్రీనివాస్, ఇంద్రసేనా రెడ్డి, రవిందర్, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

పల్లెలను పరిశుభ్రంగా తీర్చిదిద్దుదాం



ఇబ్రహీంపట్నం : ప్రత్యేకాధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

● ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 7: సంపూర్ణ పారిశుధ్యంతోనే పల్లెలకు శోభ వస్తుందని, గ్రామస్తులను భాగస్వామ్యం చేస్తూ పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. బుధవారం ఇబ్రహీంపట్నం మండల పరిషత్ సమావేశ మందిరంలో నియోజకవర్గ స్థాయి గ్రామ ప్రత్యేకాధికారుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రజా పాలన దిశగా రాష్ట్రాన్ని ముందుకు తీసుకుపోవాలని సంకల్పించారని, అధికారులు పూర్తి సహాయసహకారాలు అందించాలన్నారు. నియోజకవర్గంలో 79 గ్రామ పంచాయతీలను అన్ని రకాలుగా అభివృద్ధి చేసుకుందామన్నారు. వేసవిలో నీటి సమస్య రాకుండా చూడాలని ఆదేశించారు. గ్రామాల్లో బెల్టు షాపులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కడకూడా చెత్త కుప్పలు లేకుండా చూడాలని వెంట వెంటనే చెత్తను డంపింగ్ యార్డులకు తరలించాలన్నారు. మురుగునీరు నిల్వ ఉండకుండా చూడాలని, ప్రభుత్వ పాఠశాలల్లో కనీస వసతులు కల్పించాలని భవనాలకు రంగులు వేయించాలని సూచించారు. పంచాయతీ లేఅవుట్లలో పార్కు స్థలాలు కబ్జాకాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎంపీపీ కృపేష్ మాట్లాడుతూ ఇబ్రహీంపట్నం తహసీల్దార్ భవనం అసంపూర్తిగా ఉందని, పూర్తి చేయించాల్సిందిగా ఎమ్మెల్యేను కోరారు. యాచారం ఎంపీపీ సుకన్య, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఏపీడీ నీరజ, ఎంపీడీవోలు వెంకటమ్మ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నందిగామను ఆదర్శంగా తీర్చిదిద్దుదాం

నందిగామ : ప్రజలందరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని స్వచ్ఛతలో నందిగామను ఆదర్శంగా తీర్చిదిద్దుదామని జడ్పీ వైస్‌చైర్మన్ ఈట గణేష్ అన్నారు. అధికారులు నందిగామ మండల కేంద్రంలో స్పెషల్ సానిటేషన్ డ్రైవ్ నిర్వహించారు. గణేష్, ఎంపీటీసీలు చంద్రపాల్‌రెడ్డి, కొమ్ము కృష్ణ, దేపల్లి కుమార్‌గౌడ్, అధికారులు పాల్గొని పరిసరాల పరిశుభ్రతతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎంపీడీవో బాల్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి మల్లిఖార్జున్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కడ్తాల్ : ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జడ్పీటీసీ దశరథ్ నాయక్

పారిశుధ్య కార్యాక్రమాలకు సహకరించాలి

షాద్‌నగర్ రూరల్ : గ్రామాల్లో చేపడుతున్న సంపూర్ణ పారిశుధ్య కార్యక్రమాల విజయవంతానికి ప్రజలు సహకరించాలని ఎంపీడీవో వినయ్‌కుమార్ కోరారు. ఫరూఖ్‌నగర్ మండలం ఎలికట్టలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. వారం రోజులపాటు జరిగే పారిశుధ్య కార్యక్రమాలతో గ్రామాలను పరిశుభ్రంగా మార్చుకుందామని తెలిపారు. గ్రామాల్లో ప్రత్యేకాధికారులు సమావేశాలు నిర్వహించారు.



యాచారం : చెత్తను ట్రాక్టర్ ద్వారా తరలిస్తున్న ఎంపీడీవో విజయలక్ష్మి, కార్యదర్శి తిరుపతి

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

కొందుర్గు : గ్రామాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ముట్పూర్, రేగడి చిల్కమర్రి గ్రామాల ప్రత్యేకాధికారి, మండల వ్యవసాయాధికారి మధుసూదన్ కోరారు. గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాల్లో భాగంగా మొదటిరోజు వీధులను శుభ్రం చేశారు. ఆయా కార్యక్రమాల్లో రెండు గ్రామాల కార్యదర్శి శివకుమార్, కోయల నర్సింలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రతీఒక్కరు ఆరోగ్యంగా జీవించాలి

కొత్తూర్ : గ్రామాల్లో పరిసరాలను పరిశుభ్రం ఉంచుకుని ప్రతీఒక్కరు ఆరోగ్యంగా జీవించాలని కొత్తూర్ వైస్ ఎంపీపీ శోభలింగంనాయక్ పిలుపునిచ్చారు. ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా ఇన్ముల్‌నర్వ గ్రామంలో వైస్ ఎంపీపీతో పాటు మండల, స్థానిక అధికారులు చెత్తాచెదారం ఎత్తి వేశారు. అన్ని గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమాల్లో ఎంపీడీవో శరత్‌చంద్రబాబు, ప్రత్యేకాధికారులు పాల్గొన్నారు.



కొత్తూర్ : ఇన్ముల్‌నర్వలో పరిసరాలను శుభ్రం చేస్తున్న వైస్ఎంపీపీ శోభలింగంనాయక్, తదితరులు

కేశంపేట మండలంలో..

కేశంపేట : మండలంలోని అన్నిగ్రామాల్లో ప్రత్యేకాధికారుల నేతృత్వంలో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. మొదటి రోజు వీధులు, రోడ్లను శుభ్రం చేశారు. కేశంపేటలో ఎంపీడీవో రవిచంద్రకుమార్ రెడ్డి, కొత్తపేటలో తహసీల్దార్ అజాంఅలీ, సంగెంలో డీటీ గీత, వేముల్‌నర్వలో ఎంఈవో మనోహర్‌లు పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. బైర్కాన్‌పల్లి గ్రామంలో గ్రామ పంచాయతీ కార్మికులతో కలిసి నాయకులు పారిశుధ్య పనులు చేపట్టారు.

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం

కడ్తాల్ : పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దరిచేరవని జడ్పీటీసీ దశరథ్‌నాయక్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం స్పెషలాఫీసర్, ఎంపీడీవో రామకృష్ణ ఆధ్వర్యంలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు. జడ్పీటీసీ దశరథ్ నాయక్ హాజరై ఎంపీపీ కమ్లీమోత్యానాయక్, వైస్ ఎంపీపీ ఆనంద్, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహరెడ్డిలతో కలిసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యదర్శి రాఘవేందర్, పీఏసీఎస్ డైరెక్టర్ వెంకటేశ్, నాయకులు లాయక్‌అలీ, రాంచంద్రయ్య, శ్రీను, గణేశ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేకాధికారులు అందుబాటులో ఉండాలి

గ్రామాల్లో సమస్యలు ఉత్పన్నం కాకుండా ప్రత్యేకాధికారులు చొరవ తీసుకోవాలని, ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎంపీపీ కమ్లీమోత్యానాయక్ సూచించారు. కడ్తాల్ మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల పరిధిలోని 24 గ్రామ పంచాయతీలకు నియమితులైన ప్రత్యేక అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామ పంచాయతీల వారిగా ప్రత్యేక అధికారులతో సమస్యలపై చర్చించారు. పారిశుధ్య వారోత్సవాల నేపథ్యంలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై ఎంపీడీవో రామకృష్ణ, ఎంపీవో మదుసూధానచారిలు ప్రత్యేక అధికారులకు వివరించారు. ఎంపీటీసీ సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, రాములు, ఉమావతి, ఏఈలు, తదితరులు పాల్గొన్నారు.

వీధులను శుభ్రం చేయించిన అధికారులు

యాచారం : ప్రత్యేకాధికారులు గ్రామాల్లో పారిశుధ్యంపై దృష్టి సారించారు. ఈమేరకు మండలంలోని అన్ని గ్రామాల్లో కార్యదర్శులు, ప్రత్యేకాధికారులు పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. వీధులను శుభ్రం చేయించి చెత్తాచెదారాన్ని గ్రామానికి దూరంగా వేయించారు. కాగా, గ్రామాల్లో పంచాయతీ అధికారులు మురుగు కాలువలను పట్టించుకోలేదు. అవి పూర్తిగా నిండినప్పటికీ శుభ్రం చేయించలేదు. భూగర్భడ్రైనేజీ పనులు చేయించలేకపోయారు. గురువారం ప్రతి గ్రామంలో మురుగు కాలువలను శుభ్రం చేయించి బ్లీచింగ్ పౌడర్ చల్లించనున్నట్లు ఎంపీడీవో విజయలక్ష్మి తెలిపారు.

సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు

మంచాల : గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో శ్రీనివాస్, తహసీల్దార్ ప్రసాద్‌రావు, ఏపీవో తేజ్‌సింగ్‌లు తెలిపారు. మండల పరిధిలోని గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలను వారు ప్రారంభించారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆరుట్లలో ఎంపీటీసీలు రమేష్, శ్రీనివాస్, మంచాలలో ఎంపీటీసీ నరేందర్‌రెడ్డి, ఇతర గ్రామాల్లో ప్రత్యేకాధికారులు జ్యోతిశ్రీ, సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.



కేశంపేట : బైర్కాన్‌పల్లిలో రోడ్లను శుభ్రం చేస్తున్న పంచాయతీ కార్మికులు, నాయకులు

క్రైం కార్నర్

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

షాబాద్, ఫిబ్రవరి 7: ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన షాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సర్దార్‌నగర్ గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. షాబాద్ ఇన్‌స్పెక్టర్ యాదయ్యగౌడ్ తెలిపిన వివరాల మేరకు.. మండల పరిధిలోని సర్దార్‌నగర్ గ్రామానికి చెందిన ఈడిగి శ్రీను(30) సర్దార్‌నగర్ గ్రామంలో బజ్జీల బండి నడుపుకుంటూ జీవనం సాగించేవాడు. బుధవారం సర్దార్‌నగర్ మార్కెట్ యార్డులోని తుమ్మచెట్టుకు ఉరి వేసుకొని మృతిచెందాడు. గ్రామస్తులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు. కాగా, ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు

ఆమనగల్లు, ఫిబ్రవరి 7: వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని విఠాయిపల్లి, జంగారెడ్డిపల్లి వద్ద బుధవారం ఈ ఘటనలు చోటుచేసుకున్నాయి. ఎస్సై బలరాంనాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. మాడ్గుల మండలం కొల్కులపల్లికి చెందిన పోలే మదార్, అతడి భార్య పద్మ బైక్‌పై శుభకార్యానికి ఆమనగల్లుకు వెళుతున్నారు. ఆమనగల్లు మండలం జంగారెడ్డిపల్లి సమీపంలో ఎదురుగా వస్తున్న కారు బైక్‌ను ఢీకొట్టడంతో మదార్, పద్మలు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు ఆమనగల్లు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అలాగే విఠాయిపల్లి వద్ద శ్రీశైలం-హైదరాబాద్ జాతీయ రహదారిపై అదే గ్రామానికి చెందిన సంగెం చెన్నయ్య నడుచుకుంటూ పొలం వద్దకు వెళుతున్నాడు. ఎదురుగా హైదరాబాద్ వైపు వెళుతున్న స్కూటీ చెన్నయ్యను ఢీకొట్టడంతో గాయపడ్డాడు. అతడి కుమారుడు నరేష్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

ఇంట్లో చోరీ.. రూ.70 వేల సొత్తు అపహరణ

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 7 : ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధి ఎలిమినేడులో మంగళవారం రాత్రి తాళంవేసి ఉన్న ఓ ఇంట్లో దుండగులు చొరబడి రూ.70 వేల విలువచేసే సొత్తును దోచుకెళ్లారు. ఎస్సై రామకృష్ణ కథనం ప్రకారం.. ఎలిమినేడు గ్రామానికి చెందిన ఆదిముల్ల రవీంద్రాచారి కుటుంబ సభ్యులతో కలిసి ఓ ఫంక్షన్ కోసం మంగళవారం రాత్రి నగరంలోని హయత్‌నగర్ పరిధి కుట్లూరుకు వెళ్లారు. బుధవారం ఉదయం ఇంటికి వచ్చేసరికి ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. వెంటనే ఇంట్లోకి వెళ్లి చూడగా అల్మారా తాళం తీసి ఉంది. అందులో ఉన్న ఐదు తులాల బంగారు ఆభరణాలు, రూ.40 వేల నగదును అపహరించుకొని వెళ్లినట్లు గుర్తించారు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కల్వకుర్తిని ఆదర్శంగా తీర్చిదిద్దుతా



దర్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి

ఆమనగల్లు, ఫిబ్రవరి 7: కల్వకుర్తి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి తెలిపారు. నియోజకవర్గంలోని కడ్తాల, ఆమనగల్లు, కల్వకుర్తి మండలాల్లో బుధవారం ఎమ్మెల్యే పర్యటించారు. పలు అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొన్నారు. జీడిపల్లిలో జరిగిన ఉర్సు వేడుకల్లో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని పూజలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజా పాలనలో అన్ని వర్గాలకు మేలు జరుగుతుందన్నారు. నియోజకవర్గాన్ని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తామన్నారు. వేసవిలో విద్యుత్, తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అసంపూర్తి పనులన్నీ పూర్తిచేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆనంద్, విజయ్‌కుమార్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, అశోక్ రెడ్డి, రాజేశ్ రెడ్డి, జహంగీర్, వెంకటయ్య, రాములు, తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్ జయంతి వేడుకలను జయప్రదం చేయాలి

ఆమనగల్లు, ఫిబ్రవరి 7 : గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలు భారీ ఎత్తున నిర్వహించాలని ఆ సంఘం నాయకులు తీర్మానించారు. ఆమనగల్లు పట్టణంలోని సేవాలాల్ ఘాట్ వద్ద బుధవారం ఆమనగల్లు మండల, మున్సిపాలిటీ గిరిజన ప్రజాప్రతినిధులు, నాయకులు సమావేశం నిర్వహించారు. ఈనెల 25న నిర్వహించే సేవాలాల్ జయంతి వేడుకలపై చర్చించి పలు తీర్మానాలు చేశారు. జయంతి సందర్భంగా భారీ ర్యాలీ, బహిరంగ సభ నిర్వహించడానికి తీర్మానించారు. నాయకులు రవీందర్ నాయక్, పత్యానాయక్, దశరథ్ నాయక్, కృష్ణనాయక్, శంకర్ నాయక్, మల్లేశ్ నాయక్, పాండు, శంకర్, సురేశ్, నరేశ్, రాములు, పురుషోత్తం, భాస్కర్, రాజేశ్, కుమార్, సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బాలాజీ గజవాహన సేవ



గజవాహన సేవలో వేదపండితులు, భక్తులు

చేవెళ్ల, ఫిబ్రవరి 7 : పట్టణ కేంద్రంలోని శ్రీ బాలాజీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో రథోత్సవ వేడుకలు వైభవంగా కొనసాగుతున్నాయి. బుధవారం ప్రధాన అర్చకులు పుణ్యాహవాచనం, పల్లకీసేవతోపాటు రాత్రి స్వామి వారి గజవాహన, హన్మంత సేవ కార్యక్రమాలు కనుల పండువగా నిర్వహించారు. ఉదయం నుంచి రాత్రి వరకు స్వామివారికి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం గ్రామక్తులకు సంప్రదాయపద్దతిలో పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. దేవాలయం వ్యవస్థాపక దర్మకర్తలు పూజారి శ్రీకాంత్, శ్రీపాదు, దేవాలయం ఈవో నరేందర్, భక్తులు, గ్రామస్తులు తదితరులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

మంత్రి పొన్నంను కలిసిన నాయకులు

కడ్తాల్, ఫిబ్రవరి 7 : మంత్రి పొన్నం ప్రభాకర్‌ను బుధవారం పీసీసీ సభ్యుడు ఆయిళ్ళ శ్రీనివాస్‌గౌడ్, ఆమనగల్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహలు మర్యాద పూర్వకంగా కలిశారు. సచివాలయంలో ప్రభాకర్‌ను కలిసి పుష్పగుచ్ఛాలు అందచేసి శుభాకాంక్షలు తెలిపారు.



కల్వకుర్తిని యోజకవర్గంలో పలు అభివృద్ధి పనులు, సమస్యలను పరిష్కారంపై మంత్రి దృష్టికి తీసుకుపోగా సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు.

ఘనంగా రమాబాయి అంబేడ్కర్ జయంతి



చేవెళ్ల : రమబాయి అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఆమనగల్లు/తలకొండపల్లి, ఫిబ్రవరి 7: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ సతీమణి రమాబాయి జయంతి వేడుకలను బుధవారం ఆమనగల్లు పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వివిధ నేతలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. కందుకూరు డివిజన్ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు జంతుక శంకర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రమాబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కొప్పు యాదయ్య, మల్లెపోగు మల్లేశ్, మీసాల రమేశ్, కంబాలపల్లి అల్లాజీ, విజేందర్, తదితరులున్నారు. తలకొండపల్లి మండల కేంద్రంలోని స్వేరోస్ సర్కిల్‌లో రమాబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నాయకులు నివాళులర్పించారు. 5వ తరగతి గురుకుల ప్రవేశ పరీక్షరాసే విద్యార్థులకు మాజీ జడ్పీటీసీ పద్మ నర్సింహ ప్యాడ్లు, పెన్నులు సమకూర్చి అందజేశారు. మాజీసర్పంచ్ లలితజ్యోతయ్య, నాయకులు శేఖర్, శ్రీను, గణేశ్, మల్లేశ్, కుమార్, రమేశ్, నర్సింహ, శ్రీశైలం, తదితరులున్నారు.



షాబాద్ : రమాబాయి జయంతిలో పాల్గొని నివాళులర్పిస్తున్న నాయకులు, విద్యార్థులు

షాబాద్ : అంబేడ్కర్ సతీమణి రమాబాయి జయంతిని షాబాద్ మండల కేంద్రంలో ఘనంగా జరుపుకున్నారు. సమతా సైనిక్ దళ్ జిల్లా అధ్యక్షుడు రామస్వామి మాట్లాడుతూ అంబేడ్కర్ ఉన్నత చదువుల కొరకు రమాబాయి చాలా కష్టపడిందని గుర్తుచేశారు. అనంతరం విద్యార్థులకు నోట్‌బుక్స్ అందజేశారు. సమతా సైనిక్‌దళ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లేష్, సెక్రటరీ రాంచందర్, జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేష్, చేవెళ్ల డివిజన్ అధ్యక్షుడు బాల్‌రాజ్, షాబాద్ మండల అధ్యక్షుడు కృష్ణ, నాయకులు శంకర్, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్ల : ప్రపంచంలోనే గొప్ప త్యాగమూర్తి రమాబాయి అంబేడ్కర్ అని ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బేగరి మహేశ్ అన్నారు. పట్టణ కేంద్రంలోని అంబేడ్కర్ భవన్‌లో రమాబాయి జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలతో నివాళులర్పించారు. చేవెళ్ల అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు ప్రవీణ్, ఆల్‌ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం ఉపాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, జిల్లా కోశాధికా వినోద్, మండలాధ్యక్షుడు శ్రీనివాస్ నాయకులు సత్యనారాయణ, ఆంజనేయులు, శంకర్ తదితరులున్నారు.



తలకొండపల్లి లో విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు అందజేస్తున్న మాజీ జడ్పీటీసీ నర్సింహ

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి : ఏబీవీపీ



శంషాబాద్ : రోడ్డుపై బైటాయించిన ధర్నా చేస్తున్న ఏబీవీపీ నాయకులు, విద్యార్థులు

శంషాబాద్/ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 7 : విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఏబీవీపీ మండల శాఖ ఆధ్వర్యంలో బుధవారం శంషాబాద్ మున్సిపల్ కేంద్రలోని హైదరాబాద్-బెంగళూరు జాతీయ రహదారిపై ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఏబీవీపీ నాయకుడు శ్రీకాంత్ మాట్లాడుతూ తెలంగాణ ఏర్పాటు కోసం విద్యార్థులు ఎన్నో ఉద్యమాలు చేసి రాష్ట్రం సాధించినప్పటికీ విద్యార్థుల సమస్యలు ప్రభుత్వాలు పరిష్కరించడంలేదన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్స్, స్కాలర్‌షిప్పులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. రోడ్డుపై బైటాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పోలీసులు విద్యార్థులను బలవంతంగా అక్కడి నుంచి పంపించేశారు. అలాగే పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నంలో సాగర్ రహదారిపై విద్యార్థులు రాస్తారోకో చేశారు. ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కందడి శ్రీరామ్ మాట్లాడుతూ గత ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడిందన్నారు. ఇప్పటికి రూ.5300 కోట్ల నిధులు విడుదల చేయాల్సి ఉందన్నారు. ఏబీవీపీ గ్రేటర్ హైదరాబాద్ జాయింట్ సెక్రటరీ వంగ సంజీవరెడ్డి, పి.జగదీష్, శివకృష్ణ, సాయికిరణ్, సందీప్, రుద్రపాల తదితరులున్నారు. పోలీసులు అరెస్టుచేసి స్టేషన్‌కు తరలించారు.



ఇబ్రహీంపట్నం : రాస్తారోకో చేస్తున్న విద్యార్థులు

అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు ప్రారంభం

మాడ్గుల, ఫిబ్రవరి 7 : మండలంలోని నల్లచెర్వు గ్రామం ఎస్సీ వాడలో మండల పరిషత్ నిధులు రూ.2లక్షలతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు ప్రారంభించినట్లు ఎంపీపీ గౌరవరం పద్మ తెలిపారు. ఈమేరకు బుధవారం ఎంపీపీ భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాఘవులు, కార్యదర్శి శివకుమార్, కాంగ్రెస్ నాయకులు రెడ్డి వెంకట్‌రెడ్డి, నరేందర్, జగన్, బోదాసు వెంకటయ్య, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న ఎంపీపీ పద్మ

పంటల సాగులో మెళకువలు పాటించాలి

ఆమనగల్లు, ఫిబ్రవరి 7: పంటల సాగులో రైతులు తగిన మెళకువలు పాటించి పెట్టుబడులు తగ్గించుకొని దిగుబడులు పెంచుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారిణి అరుణకుమారి కోరారు. విఠాయిపల్లిలో బుధవారం వేరుశనగ, వరి, జొన్న పంటలను ఏవో అరుణకుమారి పరిశీలించారు. ఏఈవో మీనాక్షి, రైతులు పాల్గొన్నారు.



వరినాట్లను పరిశీలిస్తున్న ఏవో అరుణకుమారి

రాహుల్ న్యాయ్ యాత్రకు..
వంశీచంద్‌రెడ్డి సంఘీభావ యాత్ర

● 11 నుంచి సిద్దాపూర్‌లో ప్రారంభం.. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొత్తూర్, ఫిబ్రవరి 7 : ఏఐసీసీ నాయకుడు రాహుల్‌గాంధీ ఆధ్వర్యంలో చేపడుతున్న న్యాయ్ యాత్రకు సంఘీభావంగా సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డి మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలోని కొత్తూర్ మండలం సిద్దాపూర్ గ్రామంలో ఈనెల 11న సంఘీభావ యాత్ర ప్రారంభమవుతుందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. కొత్తూర్ ఐడీఏ వద్ద గల కాంగ్రెస్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ఉమ్మడి కొత్తూర్ మండలం ముఖ్యకార్యకర్తల సమావేశానికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. మొదటి రోజు కొత్తూర్ మండలం సిద్దాపూర్, ఎస్బీ పల్లి, కొడిచర్ల, పెంజర్ల, కొత్తూర్‌లో పర్యటన కొనసాగుతుందని, అనంతరం నందిగామ మండలంలోని చేగూర్ తదితర గ్రామాల్లో పర్యటిస్తారని, యాత్రకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హాజరవుతారని ఎమ్మెల్యే చెప్పారు. పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని నాయకులు, కార్యకర్తలు సైనికులా పనిచేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. మాజీ జడ్పీటీసీ శ్యాంసుందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్, కొత్తూర్, నందిగామ మండలాల అధ్యక్షులు హరినాథ్‌రెడ్డి, నర్సింహ, ఎంపీటీసీలు కృష్ణ, చంద్రపాల్‌రెడ్డి, కుమారస్వామిగౌడ్, నాయకులు బాల్‌శౌవ్‌రెడ్డి, జె. గోవర్ధన్‌గౌడ్, అంబటి ప్రభాకర్, తదితరులున్నారు.

రోడ్లకు మరమ్మతులు చేపట్టాలి

చేవెళ్ల, ఫిబ్రవరి 7 : మండలంలోని రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని చేవెళ్ల కాంగ్రెస్ నేతలు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కోరారు. బుధవారం నగరంలోని సెక్రటేరియట్‌లో ఆర్‌అండ్‌బీ శాఖ చాంబర్‌లో కోమటిరెడ్డిని కలిసి చేవెళ్ల మండలంలో రోడ్లకు మరమ్మతులు చేపట్టేందుకు కృషి చేయాలని వినతిపత్రం అందించారు. కాగా, ఆయన సానుకూలంగా స్పందించినట్లు నాయకులు తెలిపారు. నియోజకవర్గం ఇన్‌చార్జి భీంభరత్, పీఏసీఎస్ చైర్మన్లు వెంకట్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, నక్క బుచ్చిరెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు బండారు ఆగిరెడ్డి, పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.



వెంకట్‌రెడ్డితో చేవెళ్ల కాంగ్రెస్ నాయకులు

బ్రహ్మోత్సవాల చైర్మన్‌గా వేణుగోపాల్

కడ్తాల్, ఫిబ్రవరి 7: కడ్తాల మండల కేంద్రంలోని శ్రీ చెన్నకేశవ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల కార్యనిర్వాహక చైర్మన్‌గా మాజీ సర్పంచ్ తిరునగరి వేణుగోపాల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం ఆలయ ఆవరణలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామ పెద్దలు సమావేశమై బ్రహ్మోత్సవాల నిర్వాహణపై చర్చించారు. పంచాయతీ పాలక వర్గం పదవీకాలం ముగిసిన నేపథ్యంలో చైర్మన్‌గా వేణుగోపాల్‌ను ఎన్నుకున్నారు. ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహరెడ్డి, ఆలయ నిర్వాహకుడు అంజనేయులు, పీఏసీఎస్ డైరెక్టర్ వెంకటేశ్, నాయకులు తదితరులున్నారు.

ఉచిత వైద్యశిబిరం విజయవంతం

తలకొండపల్లి, ఫిబ్రవరి 7:మండల పరిధిలోని దేవుని పడకల్ గ్రామంలో బుధవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. హైదరాబాద్ వినతి వేద ఆసుపత్రి ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. స్థానిక మాజీ సర్పంచ్ కాడెమోని శ్రీశైలం శిబిరాన్ని ప్రారంబించారు. శిబిరంలో 106 మంది కి వివిద పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఆరోగ్య సంరక్షణ గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో శంకర్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

● **కడ్తాల్** : యాకత్‌పుర ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మిరాజ్‌ను డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్ మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. మిలాద్-ఉన్- నబీ పండుగ సందర్భంగా శుభాకాంక్షలు చెప్పారు. రాధాకృష్ణ, సీఎస్‌రెడ్డి, రామకృష్ణ, జీవన్‌రెడ్డి, తదితరులున్నారు.

● **కొందుర్గు** : మండల కేంద్రం నుంచి శివస్వాములు బుధవారం మహా పాదయాత్రగా శ్రీశైలం బయలుదేరారు. మండల కేంద్రంలోని శ్రీ ఉమామహేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురుస్వామి ఈసరి సత్యనారాయణ జెండా ఊపి మహాపాదయాత్రను ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రాజేష్ పటేల్, ఈసరి లింగం, జి సిద్ధేశ్వర్‌గౌడ్ పాల్గొన్నారు.

● **చౌదరిగూడ** : పెద్ద ఎల్కిచర్ల నుంచి శివమాలధారణ ధరించిన స్వాములు గురుస్వాములు భూపాలచారి, కొండి యాదయ్య, సత్యం ఆధ్వర్యంలో 300 మందితో పాదయాత్ర ప్రారంభమైంది. శివస్వాములు నర్సింలు, అంజయ్య, యాదయ్య, శ్రీశైలం, శేఖర్, శివ, లింగం, యాదగిరి, శ్రీకాంత్, రాఘవేందర్, అనిల్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

● **షాబాద్** : గృహజ్యోతి పథకాన్ని అర్హులు సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్ శాఖ చేవెళ్ల ఏడీ స్వామి, షాబాద్ ఏఈ నరేందర్ అన్నారు. మండలంలో సర్దార్‌నగర్, షాబాద్ గ్రామాల్లో వినియోగదారుల వివరాలను నమోదు చేసుకున్నారు. జంగయ్య తదితరులు ఉన్నారు.

● **షాబాద్** : మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డికి చేవెళ్ల ఎంపీ టికెట్ ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ప్రభాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం నగరంలోని కేఎల్ఆర్ నివాసంలో ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. దుశ్యంత్‌రెడ్డి, గణేష్‌ముదిరాజ్, రాములునాయక్, రఘు తదితరులు పాల్గొన్నారు.

● **చేవెళ్ల** : విద్యార్థులు చదవుతోపాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని చేవెళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కాంచనలత, కమిషరేట్ కార్యాలయం అధికారి ఆశ్ర అన్నారు. పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థుల కోసం తొలి మెట్టు కార్యక్రమం నిర్వహించారు.

● **చేవెళ్ల** : కష్టజీవులకు సీపీఐ నిరంతరం అండగా ఉంటుందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రామస్వామి అన్నారు. బుధవారం చేవెళ్ల మండల పరిధిలోని కందవాడ గ్రామంలో సీపీఐ పార్టీ జెండా ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ దేశంలో నరేంద్రమోదీ వల్ల పేదరికం పెరిగిపోయిందన్నారు. మండల ప్రధాన కార్యదర్శి సత్తిరెడ్డి, ఏఐకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రభులింగం, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్ల సత్యనారాయణచారి, మండల నాయకులు వినోద్, తదితరులు ఉన్నారు.

● **చౌదరిగూడ** : పదవికి మాత్రమే విరమణ సేవకు కాదని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సయ్యద్ హఫీజ్ అన్నారు. చౌదరిగూడ గ్రామ పంచాయతీ కార్యాలయంలో పదవీకాలం ముగిసిన పంచాయతీ పాలక వర్గానికి సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం సర్పంచ్ గూడ వెంకటస్వామి, డిప్యూటీ సర్పంచ్ అనిల్ కుమార్‌లతోపాటు వార్డు సభ్యులను శాలువాలు, పూలమాలతో సత్కరించారు. అధికారులు ఎంపీడీవో మహేష్‌బాబు, తహసీల్దార్ విజయ్‌కుమార్, జబ్బార్, శేఖర్, చందు, మల్లేష్, షకీల్ , ఖయ్యుం తదితరులు పాల్గొన్నారు.

● **యాచారం** : ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని యాచారం మండల కాంగ్రెస్ నాయకులకు వచ్చేలా చూడాలని మండల కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కోరారు. బుధవారం మండలంలోని పలు గ్రామాల కాంగ్రెస్ నాయకులు ముచ్చర్ల సంపత్, వైస్ ఎంపీపీ కె.శ్రీనివాస్‌రెడ్డి తదితరులు నగరంలోని ఎమ్మెల్యే నివాసంలో కలిసి మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని యాచారం మండలానికి వచ్చేలా చూడాలని కోరారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో మంతన్‌గౌరెల్లి మాజీ ఎంపీటీసీ కె.అరవింద్‌నాయక్, లచ్చిరెడ్డి తదితరులున్నారు.

● **ఆమనగల్లు** : ఆమనగల్లు పట్టణంలోని ప్రభుత్వ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో స్వపరి పాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థినులు చక్కటి వేషధారణతో తోటి విద్యార్థులకు బోధించిన తీరు చూపరులకు ముచ్చట గొలిపింది. సాయంత్రం పాఠశాల ఆవరణలో హెచ్‌డబ్ల్యూవో రాంచంద్రయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో బోధనలో ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు బహుమతులు ప్రధానం చేశారు.

● **తలకొండపల్లి** : తలకొండపల్లి నూతన ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన శ్రీకాంత్‌ను కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి, పీసీసీ రవీందర్‌యాదవ్, నియోజకవర్గ సోషల్‌మీడియా కన్వీనర్ అజీమ్‌లు మర్యాదపూర్వకంగా కలిశారు. స్టేషన్‌లో ఎస్ఐని పూలమాలలు, శాలువాలతో సత్కరించి అభినందించారు.